రైతుల అభ్యున్నతికి పెద్దపీట



ఏదులాపూర్ రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

- భూ భారతి చట్టంతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం
- వర్షాలకు దెబ్బతిన్న పంటలకు పరిహారం
- ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర/చిన్నచింతకుంట/భూత్పూర్: రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట వేసి సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం చిన్నచింతకుంట మండలం ఏదులాపూర్‌లో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే పాల్గొని భూ సమస్యలను తెలుసుకున్నారు. అదే విధంగా నాణ్యమైన విత్తనం.. రైతన్నకు నేస్తం కార్యక్రమంలో భాగంగా ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో దేవరకద్ర, భూత్పూర్ రైతు వేదికల్లో ఆయా మండలాలతో పాటు చిన్నచింతకుంట, భూత్పూర్, అడ్డాకుల, మూసాపేట మండలాల్లోని ఆదర్శ రైతులకు వరి, జొన్న, కందులు తదితర విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా రూపొందించిన భూ భారతి చట్టంతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ప్రభుత్వం ప్రజల వద్దకే పాలన తీసుకొచ్చి అన్ని సమస్యలను పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. భూ భారతి చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. నకిలీ విత్తనాలకు అడ్డుకట్ట వేయడం.. అధిక దిగుబడులు వచ్చే నాణ్యమైన విత్తనాలను రైతులకు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా చర్యలు చేపట్టిందన్నారు. అందులో భాగంగా ఆదర్శ రైతులకు నాణ్యమైన మూల విత్తనాలు అందిస్తున్నట్లు చెప్పారు. ఆదర్శ రైతులు విత్తనోత్పత్తి చేపట్టి ఇతర రైతులకు చేయూత అందించాలని సూచించారు. కాగా, దేవరకద్ర నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో అకాల వర్షాలకు 2,333 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని.. బాధిత రైతులకు ఎకరాకు రూ. 10వేల చొప్పున పరిహారం అందించనున్నట్లు తెలిపారు. నాలుగెకరాలకు పైగా భూమి ఉన్న రైతులకు ఈ నెల 20వ తేదీలోగా రైతుభరోసా అందుతుందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా యాసంగి సీజన్‌లో కోయిల్‌సాగర్‌కు నీరు తీసుకువచ్చామన్నారు. ప్రస్తుతం ఉంద్యాల పంప్‌హౌజ్ నుంచి కోయిల్‌సాగర్‌కు నీటిని వదలడం జరిగిందన్నారు. ఈ నెల 6న డిప్యూటీ సీఎం చేతులమీదుగా 133 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో వ్యవసాయాధికారులు సు.ధాకర్, స్నేహలత, రాజేందర్ అగర్వాల్, రాజేష్ ఖన్నా, ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ ఎల్లయ్య, టీపీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి అరవింద్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కథలప్ప, కురుమూర్తి దేవస్థాన కమిటీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దేవరకద్ర అంజిల్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, కోన రాజశేఖర్, ఆది హన్మంతరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, బాలస్వామి, నర్సింహారెడ్డి, నర్వ శ్రీనివాస్‌రెడ్డి, గోపాల్, శ్రీకాంత్‌రెడ్డి, రామాంజనేయులు, రాంపాండు, జవహర్, ఫరూఖ్, ప్రేమ్‌కుమార్, గోవర్ధన్, నాగిరెడ్డి, వెంకటేశ్, చంద్రమౌళి, గంజి బాల్‌రాజు, వెంకటేశ్ పాల్గొన్నారు.

కొత్త చట్టంతో భూ హక్కుల పరిరక్షణ

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



కప్లాపూర్‌లో భూ భారతి రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

గండేడ్/మహమ్మదాబాద్: భూ యజమానుల హక్కుల పరిరక్షణ కోసమే భూ భారతి చట్టం తీసుకువచ్చినట్లు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గండేడ్ మండలం కప్లాపూర్, మహమ్మదాబాద్ మండలం సంగాయపల్లి గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో ఎమ్మెల్యే పాల్గొని భూ సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో తాతల కాలం నుంచి సాగుచేసుకుంటున్న భూములను ధరణి పేరుతో లాక్కున్నారని అన్నారు. రికార్డుల నిర్వహణ అస్తవ్యస్తంగా మారాయన్నారు. భూ సమస్యలపై ఏళ్ల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చి రైతుల భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. అంతకు ముందు కప్లాపూర్, కొండారెడ్డిపల్లి, వెన్నాచేడ్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. అదే విధంగా వట్టెం నవోదయ పాఠశాల ప్రిన్సిపాల్ భాస్కర్‌కుమార్‌తో కలిసి వరహగిరిపల్లి శివారులో నవోదయ పాఠశాల భవన నిర్మాణానికి ఎమ్మెల్యే స్థల పరిశీలన చేశారు. కప్లాపూర్‌లో రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. కాగా, గండేడ్ మండలంలోని కప్లాపూర్, రెడ్డిపల్లి గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 40 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమాల్లో తహసీల్దార్లు మల్లికార్జునరావు, విద్యాసాగర్‌రెడ్డి, ఎంపీడీఓలు నరేందర్‌రెడ్డి, దేవన్న, హౌసింగ్ డీఈఈ పుష్పలత, డీటీ మాధవి, ఏఓ రాంపాల్, పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, పీసీసీ మెంబర్ నర్సింహారావు, నాయకులు పుల్లారెడ్డి, జితేందర్‌రెడ్డి, కేఎం నారాయణ, శాంతిబాయి, విష్ణువర్ధన్‌రెడ్డి, ముకుందం, గిరిధర్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, గోపాల్, ప్రభాకర్‌రెడ్డి, బాలయ్య, ఆశన్న, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఈద్గా పరిశీలన



జడ్చర్ల టౌన్: బాదేపల్లి పాతబజార్ ఈద్గాను మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, కమిషనర్ లక్ష్మారెడ్డి పరిశీలించారు. ఈద్గా వద్ద పెరిగిన పిచ్చిమొక్కలను తొలగింపజేశారు. ఈ నెల 7న బక్రీద్ సందర్భంగా ముస్లింల ప్రత్యేక ప్రార్థనల కోసం ఈద్గాను ముస్తాబు చేయిస్తున్నట్లు తెలిపారు.

■ వంద రోజుల ప్రణాళికలో భాగంగా మల్లెబోయిన్‌పల్లి వద్ద ఉన్న పంప్‌హౌజ్, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి పరిశీలించారు. నీటి క్లోరినేషన్ వివరాలను సిబ్బందితో తెలుసుకున్నారు. అదే విధంగా పీహెచ్, ఆర్టీసీ బస్టాండ్‌లో ఉన్న పబ్లిక్ టాయిలెట్లు, మురుగు కాల్వలను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ గాయత్రి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగేష్, ఈఈ అశోక్, వార్డు అధికారి కృష్ణయ్య పాల్గొన్నారు.

ఎస్‌ఐకి సన్మానం



నవాబుపేట: ఇటీవల రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డు పొందిన నవాబుపేట ఎస్‌ఐ విక్రమ్‌ను మంగళవారం మండల కేంద్రంలో సీనియర్ సిటిజన్ ఫోరం నాయకులు ఘనంగా సన్మానించారు. అదే విధంగా విధి నిర్వహణలో ఉత్తమ అవార్డు పొందిన హెడ్ కానిస్టేబుల్ యాదగిరిని సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ఇందిరాదేవి, మాజీ సర్పంచులు చంద్రశేఖర్, గోపాల్, సీనియర్ సిటిజన్ ఫోరం నాయకులు నాగభూషణం, నర్సింహులు, వెంకటేశ్వరప్ప, సరస్వతి, వేణునాథం, సుధాకర్‌జీ, నర్సింహులు, లతీఫ్, చిన్నస్వామి, ఆనందం, పండారినాథ్ పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ



చిన్నచింతకుంట: మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ గోపాలమ్మ కుమారుడు జుట్టు భాస్కర్‌గౌడ్ తన తండ్రి రాములుగౌడ్ జ్ఞాపకార్థం మంగళవారం అమ్మాపూర్ కురుమూర్తి స్వామి ఆలయం వద్ద పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మోహన్‌గౌడ్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం లోపించొద్దు



మిడ్జిల్: సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకొని ప్రతి గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని మండల వైద్యాధికారి శివకాంత్ అన్నారు. సీజనల్ వ్యాధుల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. పరిసరాల శుభ్రతతో దోమల ఉధృతిని అరికట్టవచ్చన్నారు. పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది సమన్వయంతో పని చేసి సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గీతాంజలి, ఎంపీఓ అనంద్, అయ్యూబ్, సంపత్, జంగయ్య, దేవయ్య, పారిజాత పాల్గొన్నారు.

జేపీఎన్‌సీఈ విద్యార్థినికి గోల్డ్‌మెడల్



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని జయప్రకాశ్ నారాయణ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని బి.స్వాతి ఎంబీఏ విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించారు. ఈ మేరకు హైదరాబాద్ జేఎన్‌టీయూలో నిర్వహించిన 13వ స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ విద్యార్థిని స్వాతికి గోల్డ్ మెడల్ ప్రదానం చేశారు. అంతేకాకుండా ఈసీఈ విభాగంలో సీనియర్ అధ్యాపకుడు రవీంద్రకుమార్ పీహెచ్‌డీ పట్టా అందుకున్నట్లు కళాశాల చైర్మన్ రవికుమార్ తెలిపారు.

సద్వినియోగం చేసుకోవాలి



అడ్డాకుల మండలం శాఖాపూర్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ మోహన్‌రావు

సాక్షి నెట్‌వర్క్: భూ సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న భూ భారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ మోహన్‌రావు, స్పెషల్ కలెక్టర్ మధుసూదన్ సూచించారు. దేవరకద్ర మండలం లక్ష్మీపల్లి, భూత్పూర్ మండలం అన్నాసాగర్, అడ్డాకుల మండలం శాఖాపూర్ గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వారు పాల్గొని భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. దేవరకద్ర మండలంలోని లక్ష్మీపల్లి, అడవి అజిలాపూర్ గ్రామాల్లో 91, భూత్పూర్ మండలంలోని అన్నాసాగర్, గోప్లాపూర్ గ్రామాల్లో 25 దరఖాస్తులు అందినట్లు తహసీల్దార్లు కృష్ణయ్య, కిషన్ తెలిపారు.

■ మహబూబ్‌నగర్ అర్బన్ మండలం తిమ్మసానిపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 38 దరఖాస్తులు అందినట్లు తహసీల్దార్ ఘన్సీరామ్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ దేవేందర్ కేసిరెడ్డి పాల్గొన్నారు. అదే విధంగా మహబూబ్‌నగర్ మండలంలోని అప్పాయిపల్లిలో నిర్వహించిన సదస్సులో తహసీల్దార్ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ శ్యామ్‌సుందర్‌రెడ్డి భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు.

■ నవాబుపేట మండలంలోని కొండాపూర్, హజిలాపూర్ గ్రామాల్లో నిర్వహించిన సదస్సుల్లో 36 అర్జీలు అందినట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ లింగం, వైస్ చైర్మన్ తులసీరాం నాయక్, డీటీ సువర్ణ, నర్సింహ, రాము, సత్యం, పరుషోత్తం, మాధవులు, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

స్వీయరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలి



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్

మహబూబ్‌నగర్ క్రీడలు: మార్షల్ ఆర్ట్స్‌తో దేహదారుఢ్యంతో పాటు మానసికంగా ఎదగవచ్చని మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మహబూబ్‌నగర్ స్కూల్‌లో ఆర్‌కే కరాటే డూ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఫౌండర్, మాస్టర్ కె.రవికుమార్ ఆధ్వర్యంలో మంగళవారం కరాటే శిక్షణ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలికలు స్వీయరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అకాడమీ సలహాదారులు ఎంఎస్ విజయ్‌కుమార్, ప్రశాంత్, సీనియర్ విద్యార్థులు నిఖిల్, రోహిత్, వర్షిణి, విఘ్నేశ్, భరత్, విశాల్, సాయిసృజన పాల్గొన్నారు.

గత పాలకుల నిర్వాకంతోనే గందరగోళం



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

జడ్చర్ల: గత పాలకుల నిర్వాకంతోనే సిగ్నల్‌గడ్డ రోడ్డు డిజైన్‌లో గందరగోళం ఏర్పడిందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్ యాదవ్, డీసీసీ అధికార ప్రతినిధి నిత్యానందం విమర్శించారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారు విలేకర్లతో మాట్లాడారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తా నుంచి పాతబజార్‌కు వెళ్లే రోడ్డు విషయంలో స్పష్టత లేదన్నారు. అదే విధంగా రోడ్డుకు ఓవైపు తక్కువ స్థలాన్ని సేకరించి.. ప్రభుత్వ స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులకు దారాదత్తం చేసి రోడ్డు వైశాల్యాన్ని కుదించారని ఆరోపించారు. ప్రస్తుతం బీఆర్‌ఎస్ నాయకులే అఖిలపక్షం అవతారమెత్తి ఎంపీ, ఎమ్మెల్యేలకు వినతులు సమర్పించి గందరగోళం సృష్టించారని గుర్తు చేశారు. చివరకు మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి స్వయంగా వచ్చి వివరణ ఇచ్చే పరిస్థితి ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. పాతబజార్ వైపు భారీ వాహనాలు మలుపు తీసుకోవడంలో ఇబ్బందులు ఉంటాయని సంబంధిత అధికారులే చెబుతున్నారని పేర్కొన్నారు. కాగా, సంబంధిత ఏఈకి కాంగ్రెస్ నాయకులు ఫోన్ చేసి రోడ్డు సమస్యపై ఆరా తీయగా.. మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి చెప్పినట్టుగా పాతబజార్ వైపు రాకపోకలకు ఎలాంటి సమస్యలు ఉండవని చెప్పడం గమనార్హం. సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజేందర్‌గౌడ్, నాయకులు రవిశంకర్, కృష్ణయ్య, రవి, నర్సింహులు యాదవ్ ఉన్నారు.

పేదల సొంతింటి కల సాకారం



టంకరలో లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

హన్వాడ: పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తపేట, టంకర, పెద్దధర్‌పల్లి, తిరుమలగిరి, మునిమోక్షం గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. అనంతరం లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేశారు. టంకరలో రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదలు ఆత్మగౌరవంతో జీవించాలన్నదే తమ ప్రభుత్వ ఆకాంక్ష అని అన్నారు. అర్హులైన పేదలందరికీ విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని.. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కాగా, ఇబ్రహీంబాద్‌కు చెందిన వెంకట్‌రెడ్డి, దొర్రితండాకు చెందిన లక్ష్మణ్‌నాయక్ ఇటీవల రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందగా.. వారి కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన వెంట ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎస్పీ వెంకటేశ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రి, నాయకులు ఎం.సురేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మహేందర్, కృష్ణయ్య, రమేశ్, గంగిరెడ్డి, లింగం, కేశవులు, నవనీత, షబ్బీర్, యాదిరెడ్డి, రఘుపతిరెడ్డి, తహశీల్దార్ కిష్టానాయక్, ఎంపీడీఓ యశోద ఉన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ



మహబూబ్‌నగర్ క్రీడలు: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్‌లో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్‌లో జిల్లా విద్యార్థులు ప్రతిభచాటి పతకాలు సాధించినట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి, సీనియర్ మాస్టర్ ఎం.సురేందర్‌బాబు తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను మంగళవారం స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రాంగణంలో అభినందించారు. రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ విభాగంలో ఎండీ రేహన్‌బాబా, ప్రన్షు వెండి పతకం, జానిత ప్రిన్సి, రోషిణి, అమలశ్రీ, ధర్మతేజ్, అస్మిత్ కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు. వ్యక్తిగత క్రీడాంశాల్లో తైక్వాండో క్రీడకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. జిల్లా క్రీడాకారులు భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జి.సాయిలు, బ్లాక్‌బెల్టు విద్యార్థులు వర్షిణి, లిఖిత్, గాయత్రి, కీర్తి పాల్గొన్నారు.

ఎంపీ మల్లు రవికి సన్మానం

నవాబుపేట: టీపీసీసీ క్రమశిక్షణ సంఘం చైర్మన్‌గా నియమితులైన నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవిని మంగళవారం మండల నాయకులు హైదరాబాద్‌లో కలిసి గజమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బంగ్లా రవి, ఖాజా, రాజేశ్, శ్రీహరి, నర్సింహులు, జంగయ్య పాల్గొన్నారు.

‘స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం’



పవన్‌కుమార్‌రెడ్డి, కొండా ప్రశాంత్‌రెడ్డిని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

అడ్డాకుల: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని మహబూబ్‌నగర్ పార్లమెంట్ కన్వీనర్ డోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని కందూర్‌లో మంగళవారం అడ్డాకుల, మూసాపేట మండలాల బూత్‌స్థాయి ముఖ్య కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొండా ప్రశాంత్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో పార్టీని మరింత పటిష్టపరిచి స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థులను గెలిపించుకునేందుకు కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని కోరారు. ఎంపీ డీకే అరుణ సహకారంతో గ్రామాల్లో అభివృద్ధి పనులకు నిధులు ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి కొండా ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. సర్పంచుల పదవీ కాలం ముగిసి 17 నెలలైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించడం లేదంటే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకోవచ్చన్నారు. గ్రామపంచాయతీలకు ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో కార్యదర్శులు అప్పులుచేసి పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నట్లు చెప్పారు. కాగా, డోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి, కొండా ప్రశాంత్‌రెడ్డిని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆయా మండలాల అధ్యక్షులు రమేష్, టీకే నర్సింహ, జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ భాస్కర్‌గౌడ్, గట్టు మల్లేష్, సురేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, కొండారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, చెన్నగౌడ్, గుడిబండ రవీందర్‌గౌడ్ ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు



జడ్చర్ల/జడ్చర్ల టౌన్: పట్టణంలోని అయోధ్యనగర్‌లో శ్రీసింధూర్ వరసిద్ధి వినాయక, ఆంజనేయ స్వామి, ధ్వజస్తంభం, నవగ్రహ, జంట నాగుల విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రాతఃకాలపూజ, సామూహిక గణపతి హోమాలు, ప్రదోషకాల పూజ, జలధివాసం తదితర ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం వరసిద్ధి వినాయక విగ్రహంతో శోభాయాత్ర నిర్వహించారు. భక్తుల భజనలు, కోలాటాలతో శోభాయాత్ర కోలాహలంగా సాగింది. బుధవారం యంత్రస్థాపన, విగ్రహ స్థాపన, ప్రాణప్రతిష్ఠ, పూర్ణాహుతి సమర్పణ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ప్రశాంత్‌రెడ్డి, రంజిత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ బోనాలు

దేవరకద్ర: మండలంలోని గోపన్‌పల్లిలో మంగళవారం ఎల్లమ్మ బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

తెలంగాణ ఆల్‌మేవా జిల్లా కమిటీ ఏర్పాటు

స్టేషన్ మహబూబ్‌నగర్: తెలంగాణ ఆల్ మైనార్టీ ఎంప్లాయీస్ వర్కర్స్ (ఆల్‌మేవా) జిల్లా కమిటీ ఏర్పాటైంది. ఈ మేరకు ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి ఎంఏ రషీద్ నూతన కమిటీ నివేదికను అందజేయగా.. రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు షేక్ ఫారుఖ్ హుస్సేన్, సయ్యద్ వహీద్‌షా ఆమోదించి ఉత్తర్వులు జారీ చేసినట్లు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా అబ్దుల్ ఖలీల్, అసోసియేట్ అధ్యక్షులుగా మహ్మద్ మహబూబ్‌అలీ, మహ్మద్ సయీద్, మహ్మద్ కమాలుద్దీన్, ఖాదర్‌వలీ, సయ్యద్ రహెమాన్ ఖాద్రీ, కోశాధికారిగా మహ్మద్ ఆరిఫ్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శిగా ఎండీ సులేమాన్, మహిళా కార్యదర్శులుగా ఫర్జానాబేగం, తస్లీం, ఆమీనా నాజ్‌నిన్, లీగల్ అడ్వైజర్‌గా మహ్మద్ అబ్దుల్ వహాబ్, చీఫ్ అడ్వైజర్లుగా ఎంఏ ఖయ్యూం, యూసుఫ్ బిన్ నాసర్‌తో పాటు ఉపాధ్యక్షులుగా ఐదుగురిని, అదనపు కార్యదర్శులుగా నలుగురిని, సంయుక్త కార్యదర్శులుగా నలుగురిని, కార్యనిర్వాహక కార్యదర్శులుగా నలుగురిని, కార్యదర్శులుగా ముగ్గురిని, ఈసీ మెంబర్లుగా ఐదుగురిని, మహిళా ఉపాధ్యక్షులుగా ముగ్గురిని నియమించినట్లు తెలిపారు. అదే విధంగా పెన్షనర్స్ యూనిట్ అధ్యక్షుడిగా సయ్యద్ ఖాజా నిజాముద్దీన్, ప్రధాన కార్యదర్శిగా మహ్మద్ అహ్మద్, ఇతర కార్యవర్గాన్ని నియామకం చేసినట్లు పేర్కొన్నారు. తెలిపారు.

నాణ్యమైన మూల విత్తనాలతో మేలు



మల్లెబోయిన్‌పల్లిలో రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న డీఏఓ వెంకటేశ్

జడ్చర్ల/మహమ్మదాబాద్/నవాబుపేట/రాజాపూర్: నాణ్యమైన మూల విత్తనాలతో రైతులకు మేలు చేకూరుతుందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి వెంకటేశ్ అన్నారు. నాణ్యమైన విత్తనం.. రైతన్నకు నేస్తం కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని మల్లెబోయిన్‌పల్లి రైతువేదికలో ఆదర్శ రైతులకు వరి, కందులు, జొన్న విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా 31మంది రైతులకు 10 కిలోల చొప్పున వరి విత్తనాలు, మరో 31మందికి 3కిలోల చొప్పుల కందులు, 31 మందికి 3కిలోల చొప్పున జొన్నల విత్తనాలను అందజేశారు. అనంతరం డీఏఓ మాట్లాడుతూ.. రైతులు భవిష్యత్‌లో ప్రైవేటు కంపెనీలపై ఆధారపడకుండా తమ ముంగిట్లోనే నాణ్యతమైన విత్తనాలను ఉత్పత్తి చేసుకోవాలనే లక్ష్యంతో ప్రభుత్వం నాణ్యమైన మూల విత్తనాలను అందిస్తుందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త సీహెచ్ బాలచందర్, ఏఓ గోపినాథ్, మాజీ ఎంపీపీలు వెంకటయ్య, నిత్యానందం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్‌యాదవ్, బాల్‌రెడ్డి, సాయిరెడ్డి పాల్గొన్నారు.

■ మహమ్మదాబాద్ మండల కేంద్రంతో పాటు సంగాయపల్లి గ్రామంలో ఏఓ నరేందర్ ఆదర్శ రైతులకు మూల విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త నీమపర్వీన్, నాయకులు నారాయణ, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీను పాల్గొన్నారు.

■ నాణ్యమైన విత్తనం.. రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా ఆదర్శ రైతులకు అందిస్తున్న మూల విత్తనాలను సద్వినియోగం చేసుకొని ఇతర రైతులకు తోడ్పాటు అందించాలని ఏడీఏ కృష్ణకిషోర్, శాస్త్రవేత్త రాధిక సూచించారు. నవాబుపేట మండలంలోని పలు గ్రామాల్లో ఆదర్శ రైతులకు వరి, పచ్చజొన్న, కందులు, ఇతర రకాల విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ లింగం, వైస్‌చైర్మన్ తులసీరాం నాయక్, జహీర్, భూపాల్‌రెడ్డి, నర్సింహ, సత్యం, రాము, శ్రీనివాస్ పాల్గొన్నారు.

■ రాజాపూర్ మండలంలోని రంగారెడ్డిగూడలో మాజీ సర్పంచ్, ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మాతృమూర్తి శశికళారెడ్డి ఆదర్శ రైతులకు మూల విత్తనాలను పంపిణీ చేశారు. మొత్తం 16 రెవెన్యూ గ్రామాల్లో ఆదర్శ రైతులకు 48 కిట్లు పంపిణీ చేసినట్లు ఏఓ ప్రదీప్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అశ్విని, వైస్‌చైర్మన్ శేఖర్‌గౌడ్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ రాజమణి, ఏడీఏ కృష్ణకిషోర్, ఏఈఓలు దీపికాగౌడ్, శ్రీనివాస్, మహేశ్, రమేశ్ పాల్గొన్నారు.

ప్రతిభా విద్యార్థులకు అవార్డులు



మాట్లాడుతున్న బీసీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణుడు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పదో తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీ, గురుకులాల విద్యార్థులకు ఈ నెల 5న బీసీటీఏ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణుడు చెప్పారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బీసీ భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ప్రతి పాఠశాల టాపర్‌కు పురస్కారం అందిస్తామని.. ఈ నెల 5న స్థానిక ఆల్మాస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే కార్యక్రమంలో విద్యార్థులు, పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొనాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు గురుప్రసాద్, కార్యదర్శి రాఘవేందర్, ధనుంజయ్, కోశాధికారి రమేశ్, మల్లేష్, శివకుమార్ ఉన్నారు.